వంద పడకల దవాఖానగా మార్చాలని వినతి

షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను వంద పడకల దవాఖానగా మార్చాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఓబీసీ మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీకి దోమకొండ, బీబీపేట మండల కాంగ్రెస్ నాయకులు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, బీబీపేట్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, బీబీపేట మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామస్వామి గౌడ్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

బీబీపేట్, ఫిబ్రవరి 13 : మండలంలోని మాందాపూర్ ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 42 విద్యార్థులకు రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ నాగరాజ్‌గౌడ్ అల్పాహారం అందజేశారు. నెల రోజులపాటు సొంత డబ్బులతో అల్పాహారం అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు సారయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వహీద్, కృష్ణ, పవన్, విజయానంద్, బాబు, సులోచన, రామారావు, శ్యామ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత రమర్తి సుమన్‌రేఖ – పోతా రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘం సభ్యులు దామోదర్, ఆనంద్, విజయ్, జగదీశ్, సురేశ్, ప్రవీణ కుమార్, హరి శంకర్, చంద్రబాబు, ప్రేమ్‌కుమార్, సంతోష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 16 జాబ్‌మేళా

కామారెడ్డి, ఫిబ్రవరి 13 : కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఉన్న రూం నంబర్ 121లోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, కామారెడ్డిలో పని చేసేందుకు అపోలో ఫార్మసీ కంపెనీ వారు ఉద్యోగమేళా నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9573973688, 9848237987, 7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆరోపణలు చేస్తే సహించం

రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 13 : అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ నాయకుడిపై ఆరోపణలు చేస్తే సహించబోమని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి అన్నారు. బాన్సువాడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఏనుగు రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని అన్నారు. అతి తక్కువ సమయంలోనే బాన్సువాడ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ వర్ని నాయకుడు యలమంచిలి శ్రీనివాస్‌రావు స్థానిక ప్రజలకు ఏం చేశారో చెప్పాలని, అదివదిలేసి తమ నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి, వారి కుటుంబ సభ్యులపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ పట్టణ కాంగ్రెస్ నాయకుడి సతీమణి ఆరోగ్యం సరిగా లేకపోతే డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రాణాలను కాపాడిన కూడా కృతజ్ఞత లేదన్నారు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. పోచారం శ్రీనివాసరెడ్డిది 45 సంవత్సరాల మచ్చలేని రాజకీయ చరిత్ర అని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల సీనియర్ నాయకులు దొడ్ల వెంకట్‌రాం రెడ్డి, ఎజాస్, ఆత్మక మిటీ చైర్మన్ మోహన్ నాయక్, శ్రీధర్, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

రాష్ట్రస్థాయి అవార్డులకు విద్యార్థినుల ఎంపిక

సంజన, వైష్ణవి

మాచారెడ్డి, ఫిబ్రవరి 13 : మండలంలోని అక్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుశ్రీ తెలిపారు. సంజన, వైష్ణవి అనే విద్యార్థినులు ప్రదర్శించిన ప్రయోగాలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా నుంచి ఎనిమిది మంది ఎంపిక కాగా అక్కాపూర్ జడ్పీహెచ్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. ఈ ప్రయోగాలు చేపట్టడంలో సహకరించిన గైడ్ టీచర్ సుస్మితతో పాటు ఉపాధ్యాయులను ఎంపీటీసీ లత, మాజీ సర్పంచ్ మమత, గ్రామస్తులు అభినందించారు.

పోకిరీలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 13 : అమ్మాయిలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని షీ టీం ఎస్సైకి కామారెడ్డి ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని జీవీఎస్ హాస్టల్ దగ్గర ఉన్న ఎస్సీ హాస్టల్‌లో ఉండే అమ్మాయిలను కొంత మంది అబ్బాయిలు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. రాత్రి పూట కొంత మంది యువకులు బైక్‌పై చక్కర్లు కొడుతూ అమ్మాయిలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రోహిత్, అల్తాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భిక్కనూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బాగిర్తిపల్లికి చెందిన నీల కుమార్ కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి పాత ఇంటికి వెళ్లి పడుకున్నారు. ఉదయం వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు తులాల బంగారు, 30 తులాల వెండి అభరణాలు, రూ.95,200 నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గురుకుల ఉద్యోగుల నిరసన

బోర్లం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 13 : గురుకుల పాఠశాలలో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, జీవో నంబర్ 317 అమలు చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరుతూ బోర్లం క్యాంపు గురుకుల పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, రజిని, తాహేరాబేగం, ఆస్మా, ప్రణిత, శృతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబాలను ఆదుకోవాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 13 : ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కామారెడ్డి జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్, ఐక్యకార్యాచరణ కమిటీ (జేఏసీ) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్ వద్ద మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సింహులు మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడు భూషణ్‌గౌడ్, స్వామి గౌడ్, మారుతీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నిరసన తెలియజేస్తున్న కామారెడ్డి ఆటో యూనియన్ సభ్యులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

దోమకొండ, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు శరత్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రేఖ, నవీన్, శ్రీధర్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 13 : బుడ్మి సహకార సంఘం లో స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి కృష్ణమయ్య మంగళవారం సూచించారు. పంట రుణాలను రెన్యువల్ చేసుకునే రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

నేడు ఆలయ షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలం

మాచారెడ్డి, ఫిబ్రవరి 13 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని వీరహనుమాన్ ఆలయ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లకు బుధవారం ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో ప్రభురాంచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు ఆలయంలోని కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

మాచారెడ్డిలో మెగా వైద్యశిబిరం

మాచారెడ్డి, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలో శ్రీలక్ష్మీనర్సింహ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ ముత్యాల నర్సింహారెడ్డి మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన తండ్రి తొమ్మిదో వర్ధంతి సందర్భంగా గ్రామంలో జనరల్ ఫిజీషియన్, దంత, కంటి వైద్యుల ఆధ్వర్యంలో దాదాపు 500 మంది నిరుపేదలకు ఉచితంగా పరీక్షలతోపాటు మందులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కిషన్ గౌడ్, గడ్డం బాబు, నవీన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

24 నుంచి 27 వరకు టెక్నికల్ కోర్సు పరీక్ష

కామారెడ్డి, ఫిబ్రవరి 13 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు మంగళవారం తెలిపారు. టైలరింగ్ ఎంబ్రాయిడర్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్ష ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూగర్భ జలాల సంరక్షణపై అవగాహన

మాచారెడ్డి, ఫిబ్రవరి 13 : పాల్వంచ మండలం భవానీపేటలో భూగర్భ జలాల సంరక్షణ, నియంత్రణపై భూగర్భ జలశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. భూగర్భ జలాల జిల్లా అధికారి సతీశ్‌యాదవ్ మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడాలని, వాల్టా చట్టం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా పశువైద్యాధికారి నరసింహారావు, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ రాజు, ఎంపీటీసీ రాజనర్సు, మాజీ సర్పంచ్ మద్దెల రాజు పాల్గొన్నారు.

డివైడర్ మూసి వేయాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 13 : రామాయంపేట్ నుంచి భిక్కనూరుకు వచ్చే బైపాస్ చర్చి వద్ద ఉన్న డివైడర్‌ను మూసి వేయాలని భిక్కనూరు గ్రామ పంచాయతీ ఈవో, పోలీసులకు గ్రామస్తులు మంగళ వారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన వివా హిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో బైపాస్ వద్ద సుమారు 51 మంది వరకు మృతి చెందారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రామదండు సభ్యులు భగీరథ్, రమేశ్‌యాదవ్, సిద్ధేశ్వర్, బాల్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్ సీఐ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

సదాశివనగర్, ఫిబ్రవరి 13: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సదాశివనగర్ సీఐ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పోలీసులు నిత్యం పనిచేస్తారని చెప్పారు. ఆపద సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. హైవేపై 24 గంటలపాటు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. బాగా పనిచేస్తున్నారని సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, సదాశివనగర్, గాంధారి ఎస్సైలు రాజు, ఆంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: నల్లగొండలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభకు ఎల్లారెడ్డి నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడారు. పదేండ్ల నుంచి చేసిన అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కృష్ణ జలాలను రక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని విమర్శించారు.

ధాన్యం లారీ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 13: మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గేటు సమీపంలో బోధన్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం ధాన్యం లారీ బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న నిజాంసాగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఎస్సైకి సన్మానం

ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 13: నిజాంసాగర్ ఎస్సైగా సుధాకర్ ఈనెల 11న బాధ్యతలను స్వీకరించారు. దీంతో ఆయనను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. శాలువాలు కప్పి సత్కరించారు. మండలంలో శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని కోరారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విఠల్, నాయకులు నారాయణ, రమేశ్‌గౌడ్, విజయ్, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు జయప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు లక్ష్మయ్యసార్, అనీస్, లక్ష్మణ్, నిఖిల్, గూల లక్ష్మణ్, శ్రీనివాస్, శేఖర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద సీఐకి..

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 13: బిచ్కుంద సీఐగా బాధ్యతలను స్వీకరించిన నరేశ్‌ను కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. సమస్యలు ఉంటే నేరుగా కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కోనారెడ్డి, సీనియర్ నాయకులు కుర్లెపు హన్మాండ్లు, హైమద్, మాజీ సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బారడి పోచమ్మకు బోనాల సమర్పణ

బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న హస్గుల్ గ్రామస్తులు

బిచ్కుంద, ఫిబ్రవరి 13: మండలంలోని హస్గుల్ గ్రామంలో బారడి పోచమ్మ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మారుతి, ఎంపీటీసీ నారాయణ, మంద రమేశ్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం

ఏర్పాట్లు పూర్తి

ఎల్లారెడ్డిలోని అయ్యప్పస్వామి ఆలయం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 13: ఎల్లారెడ్డిలోని అయ్యప్పస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ముత్యాల శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. వసంత పంచమి పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ, ఆరు నుంచి 7–30గంటల వరకు మూలవిరాట్టుకు పంచామృతం తదితర అభిషేకాలు, 8–30 నుంచి 11గంటల వరకు గణపతి హోమం, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ, కలశస్థాపన, దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 11–30గంటలకు దివ్య పదునెట్టాంబడికి ప్రత్యేకపూజ, మధ్యాహ్నం 1గంటకు భక్తులకు అన్నదానం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తికి పల్లకీసేవ ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పిట్లం ఎస్సైగా నీరేశ్..


బాధ్యతలను స్వీకరిస్తున్న ఎస్సై నీరేశ్

పిట్లం, ఫిబ్రవరి 13: పిట్లం నూతన ఎస్సైగా నీరేశ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన విజయ్‌కొండ రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రుద్రూర్ ఎస్సైగా పనిచేస్తున్న నీరేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానిలు సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రామభక్తుల ఆత్మీయ సమ్మేళనం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 13: పట్టణంలోని కోదండ రామాలయంలో మంగళవారం అయోధ్య రామభక్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. జనవరి 22వ తేదీన గ్రామాల్లో అయోధ్య శ్రీరాముని పట్టాభిషేక కార్యక్రమాలను నిర్వహించిన నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమ్మేళనాన్ని చేపట్టారు. అక్షింతల పంపిణీ, పట్టాభిషేక కార్యక్రమాలను విజయవంతం చేసిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వీహెచ్‌పీ ప్రాంత సంఘటన మంత్రి ముడుపు యాదిరెడ్డి, ఎల్లారెడ్డి ప్రఖండ అధ్యక్షుడు అవుసుల నవీన్, విభాగ్ కార్యదర్శి కృష్ణ, ఎల్లారెడ్డి ఖండ కార్యవాహ మంచిర్యాల శ్రీకాంత్, నాయకులు ఆదిమూలం సతీశ్‌కుమార్, కుశలకంటి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ పాలక వర్గానికి సన్మానం

డోంగ్లీ, ఫిబ్రవరి 13: పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం జనవరి 31తో ముగిసిన విషయం తెలిసిందే. దీంతో మండలంలోని పెద్ద టాక్లీ గ్రామ సర్పంచ్‌తోపాటు పాలకవర్గాన్ని మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ రాజాబాయి, ఉపసర్పంచ్ యాదవ్‌రావు, పాటిల్, వార్డు మెంబర్లు దిలీల్‌కుమార్, మాధవ్, నాయకులు విలాస్ గౌక్వాడ్, సాయిలు గొండ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

పోచారం చౌరస్తా హైవే వద్ద సూచనలు ఇస్తున్న సీఐ నరేశ్

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 13: జాతీయ రహదరి161పై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులకు సీఐ నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోచారం చౌరస్తాను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఐదు రోజుల క్రితం పోచారం చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. ఇక్కడ ప్రమాదాలు జరుగకుండా సిగ్నల్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని హైవే అథారిటీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఎస్సై కోనారెడ్డి, పోలీసు సిబ్బంది సాయిశివ, అంజి, హైవే సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రారంలో ఈజీఎస్ గ్రామసభ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: మండలంలోని రుద్రారం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ గ్రామ సభను ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎంపీపీ మాధవి అధ్యక్షత వహించారు. తమకు డబ్బులు రాలేదని కూలీలు ఆమెకు ఫిర్యాదు చేశారు. డబ్బులు త్వరగా వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ గ్రామ ప్రత్యేక అధికారి గిరిధర్, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామారెడ్డి, ఫిబ్రవరి 13: మండలంలోని జగదాంబతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఫకీరాతండాలో చేపట్టే సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.పది లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి అరవింద్ రెడ్డి, రెడ్యానాయక్, గొల్లపల్లి కిషన్‌యాదవ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాయంలో నవనాథ శతాబ్ది ఉత్సవాలు

పిట్లం, ఫిబ్రవరి 13: మండలంలోని రామలింగేశ్వర ఆలయంలో భక్తులు నవనాథ శతాబ్ది ఉత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నిజాంసాగర్, ఫిబ్రవరి13: మండలంలోని ఆరేపల్లి గ్రామం లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర్ మంగళవారం పరిశీలించారు. పలు కాలనీల్లో పర్యటిస్తూ మురికి కాలువలు, క్లోరినేషన్, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేశారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై చెత్తను పారేయకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాల ని స్థానిక అధికారులకు సూచించారు.

రోడ్డు నిర్మాణ పనులు..

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: నాగిరెడ్డిపేట మండలంలోని జానకంపల్లి ఊర చెరువు నుంచి బెజగం చెరువు తండా వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. రూ.కోటీ 24 లక్షలతో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు కృష్ణ, ధనుంజయ్, సాయిలు తదితరులు ఉన్నారు.